# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 01 జూన్, 2024 | పేజీలు : 4





## నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ కేసులు

# ఇష్టారాజ్యంగా మట్టి మాఫియా

### ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న మట్టి మాఫియాలు...



**ప్రజాపక్షం/ హాలియా :** నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతూ విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేపడుతూ కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు జరుపుతూ మట్టి మాఫియా కోట్ల రూపాయలు కొల్లగొడుతు ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొడుతుంది. నియోజకవర్గంలో అన్ని ప్రధాన మండల కేంద్రాలలో కొందరు మట్టి మాఫియా చేస్తున్న ఈ అక్రమ మట్టి వ్యాపారం వారికి కోట్ల రూపాయలు తెచ్చిపెడుతుంది. ప్రభుత్వ భూములు, పడావుపడ్డ భూములే వీరి లక్ష్యం. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులను నయానో భయానో గుప్పెట్లో పెట్టుకొని ఈ అక్రమ మట్టిదందా చేస్తున్నారు. జిల్లా మైనింగ్ అధికారులకు ఏమాత్రం తెలియకుండా తెలిసిన వారిని క్షేత్రస్థాయికి రానీయకుండా రాజకీయ బలాన్ని ఉపయోగిస్తూ ఈ మట్టి మాఫియా చేస్తున్న ఈ అక్రమ మట్టి వ్యాపారం భూములు గుల్ల గుల్ల అవుతున్నాయి. అనుమతులు లేని ఈ మట్టి తోలకం గ్రామాలలో చిచ్చు పెడుతుంది. ఇదే విషయమై గత నెల 28వ తేదీ మంగళవారం నాడు అనుముల మండలం పాలెం గ్రామంలో చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారంటూ గ్రామస్తులు మట్టి మాఫియా పై ఎదురు తిరిగారు. ఎవరి అనుమతి లేకుండా విచ్చలవిడిగా ఈ మట్టి తోలకం ఎందుకు చేపడుతున్నారు అంటూ వారిని నిలదీశారు. దీంతో మట్టి మాఫియా కు గ్రామస్తులకు కొంత వివాదం ఏర్పడింది. గ్రామానికి ఏమాత్రం ఉపయోగపడని ఈ మట్టి తోలకాన్ని తాము ఒప్పుకునేది లేదని గ్రామస్తులు మట్టి మాఫియాతో ఘర్షణకు దిగడంతో తాత్కాలికంగా ఆ తోలకాన్ని నిలిపి వేశారు. ఇలాంటి సంఘటనలు నియోజకవర్గంలో నిత్యం జరుగుతూనే ఉన్న ఎక్కడ వీరిపైన చర్యలు చేపట్టిన దాఖలాలు లేకపోవడం అధికారుల తీరు విమర్శలకు ఊతమిస్తోంది. నిడమనూరు మండలంలోని ముప్పారం, ఎర్రబెల్లి, బోడు భూమి, అనుముల మండలంలో ప్రభుత్వ చెరువులు, ప్రభుత్వ భూములను వీరు టార్గెట్ గా పెట్టుకొని ఈ మట్టి దందాను నిర్విరామంగా చేపడుతున్నారు. కోట్ల రూపాయలతో ముడిపడి ఉన్న ఈ వ్యాపారంలో కొందరు రాజకీయ నాయకులు కూడా భాగస్వాములై దాందా చేస్తు కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న తీరు విమర్శలకు దారితీస్తుంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపడుతున్న ఈ వ్యాపారం మూలంగా ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుంది. ఇంత బహిరంగంగా ఈ అక్రమ మట్టి వ్యాపారం జరుగుతున్నప్పటికీ అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోతుండడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందువలన జిల్లా మైనింగ్ అధికారులు సాగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలలో విచ్చలవిడిగా జరుగుతున్న ఈ అక్రమ మట్టి వ్యాపారాన్ని అడ్డుకొని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



# ఎరువులు, విత్తనాల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు



### జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**ప్రజాపక్షం/మోతె :** ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవపురం ఎక్స్ రోడ్డులోని శ్రీరామ ఫెర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు దుకాణదారులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసే సమయంలో దుకాణదారుల నుండి తప్పకుండా రశీదులు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారులు ప్రతి రోజు సూచిక బోర్డులో నిల్వల వివరాలు నమోదు చేయాలన్నారు. రైతులు దళారుల వద్ద విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయవద్దన్నారు. అనంతరం మండలంలోని తుమ్మలపల్లి, మోతె మండల కంద్రంలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎపిఓ హరిసింగ్ నాయక్, ఎస్ఐ యాదవేంద్రరెడ్డి, ఎఓ అరుణ, ఆర్ఐ అజయ్, ఎపిఎం వెంకయ్య, ఎపిఓ నగేష్, టిఎలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## సమ్మెలో ఇండేన్‌గ్యాస్ సిబ్బంది

# దామరచర్ల వైటిపిఎస్‌లో దొంగతనం ముఠా అరెస్ట్

### కోటి 49 లక్షల రూపాయలతో పాటు ఆటో, కారు, మోటారు సైకిల్ స్వాధీనం

### 11 మంది నిందితులు అరెస్ట్

### జిల్లా ఎస్‌పి చందనా దీప్తి

**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దామరచర్లలోని వైటిపిఎస్ ప్రాజెక్టు నందు భారీ నిర్మాణ కార్యక్రమం జరుగుతుండగా అందుకు అవసరమైన పరికరాలను భారీ ఎత్తున వైటీపీఎస్ పరిసరాలలో నిలువ చేసిన జిఐ అల్యూమినియం షీట్ల గత ఒకటిన్నర సంవత్సర కాలంగా భారీ ఎత్తున చోరీకి గురికావడంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగతనం చేసిన ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి చందనా దీప్తి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల ముఠాను ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. నిందితులు మిర్యాలగూడ చెందిన మహమ్మద్, మునీర్, అశోక్, మహేష్, జానీ, రజాక్ లు ఒక ముఠాగా ఏర్పడి, దామరచర్లకు చెందిన ఆఫ్రోజ్, నాగేంద్రబాబు, శ్రీనులతో కలిసి వైటిపిఎస్ సంస్థలో సెక్యూరిటీ గార్డ్ లు రవి, రాంబాబు ,యాకూబ్, యూపీ కి చెందిన సూపర్వైజర్ రంజిత్ , క్రేన్ ఆపరేటర్ రవీందర్ ల సహకారంతో సదరు ఈ నేరంలో భాగస్తులైన సెక్యూరిటీ గార్డులు విధులలో ఉన్న సమయంలో వైటిపిఎస్ ఆవరణ లోకి డిసిఎం వాహనము పంపి, క్రేన్ ఆపరేటర్ సహాయంతో పరికరాలను దొంగిలించి వాటిని హైదరాబాదు లోని ముషీరాబాద్ కు చెందిన షర్ఫొద్దీన్ కు విక్రయించి సొమ్ము చేసుకుని పంచుకున్నట్లు తెలిపారు.ఇట్టి కేసు విచారణ ఇంకా కొనసాగుతున్నందున నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచి మళ్లి పోలీస్ కస్టడీ ద్వారా తదుపరి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దొంగతనంలో ఇంకా ఎవరెవరు నిందితులు భాగస్వాములుగా ఉన్నారో సమగ్రంగా విచారణ జరిగేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టిందన్నారు. ఈ కేసును చేధించిన మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు, సిఐ వీరబాబు, వాడపల్లి ఎస్ఐ రవి , వేములపల్లి ఎస్ఐ విజయ్ కుమార్, మాడుగులపల్లి ఎస్ఐ శోభన్ బాబు, వాడపల్లి సిబ్బంది, సిసిఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణులను జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.





## విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ విద్యార్థులకు అవార్డులు




**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** ఈనెల 30న కళానిలయం కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారు నిర్వహించిన 133 కళాకారులచే తెలుగు బుక్ ఆఫ్ రికార్డు కోసం నిర్వహించిన కార్యక్రమంలో విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ 12 మంది విద్యార్థులు వేసిన అంబేద్కర్ పోర్ట్రేయిట్స్‌కు ఎక్సలెన్స్ అవార్డు లభించాయని చిత్రకారుడు విజయ్‌కుమార్ తెలిపారు. 133 కళాకారుల్లో 12 మంది విద్యార్థులు అవార్డ్స్ గెలుచుకున్నందుకు, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తున్నందుకుగాను చిత్రకారుడు విజయ్‌కుమార్‌ను, విద్యార్థులను త్యాగరాజ గాన సభ చిక్కడపల్లిలో మెమెంటో, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.పి.భారతి, కొంకటి లక్ష్మీనారాయణ, సురేందర్‌లు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి కృషి చేయాలి

**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** మండలంలోని ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ నూకల సరళ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగు నీరు, విద్య వసతులపై ప్రత్యేకాధికారులు దృష్టి సారించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరి శర్మ, ఏఈ ఆదినారాయణ, అమర్‌సింగ్, మౌనిక, ఉమాదేవి, విజయలక్ష్మి, ఏవో సరిత, సీడీపీవో కళావతి, సీడీపీవో మమత, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధ్యక్షులుగా కల్యాణి

**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** రాష్ట్ర మున్సిపల్ పరిపాలన కమీషనర్ అండ్ డైరెక్టర్ డి.దివ్య ఆదేశాలమేరకు మున్సిపల్ కార్యాలయంలో మహిళల వేదింపుల నివారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేశామని మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ తెలిపారు. శుక్రవారం కమిటీకి నియామకపత్రాలు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 9న ఈ మేరకు సీఎండీఏ జారి చేసిన ఉత్తర్వు ప్రకారం కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ మహిళ ఉద్యోగి రెవెన్యూ టి.కల్యాణి అధ్యక్షతన సామాజిక కార్యకలాపాల్లో అనుభవమున్న ఇద్దరు వార్డు ఆఫీసర్లు రాధా, సరిత మహిళలను, మహిళల కోసం పిచేసే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల నుంచి పులి పద్మావతిను కమిటీలో నియమించామన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కమిటీ పనిచేసే వారిపై ఫిర్యాదుల నమోదు చేసే యాక్ట్ 2013 ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కల్యాణి ఉన్నారు.

## కరాటే శిక్షణా శిబిరం సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఏప్రిల్ 24 నుండి మే 31 వరకు వేసవి కరాటే శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షావోలిన్ షోటోఖాన్ ఫౌండర్ నాంపల్లి కనకారావు చేతుల మీదుగా సమ్మర్ ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కరాటే శిక్షణ శిబిరం అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకున్నారు.

# నూతన చట్టాలపైన అవగాహన పెంచుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ :** దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి అమలయ్యే నూతన చట్టాల గురించి కానిస్టేబుల్ నుండి ఉన్నత అధికారుల వరకు విసంపూర్ణ అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పి చందనా దీప్తి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన చట్టాల పైన అధికారులకి,సిబ్బందికి నాలుగు రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యలలో భాగంగా కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత , భారతీయ సాక్ష్యా అధినియం, ఈ మూడు చట్టాలు రానున్న జూలై 1 నుండి అమలులోకి రానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. ప్రతి పోలీసు అధికారికి, సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్ కు ఎవరు అర్హులు, చార్జీషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు ప్రక్రియలో అధికారులు ఎలా వ్యవహరించాలి తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు చేర్పులు చేశారు అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రాములు నాయక్, ఎస్‌బి డిఎస్పి రమేష్, డిఎస్పి సైదా ఎస్ఐ, సిఐ, సిబ్బంది ఉన్నారు.

## శ్రీలక్ష్మితిరుపతమ్మ జాతరలో కోలాట పోటీలు

**ప్రజాపక్షం/వేములపల్లి :** మండలంలోని రావులపెంట గ్రామంలో జరిగే శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల జాతర సందర్భంగా కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు జిన్నా నాగిరెడ్డి ఆవిరెన్ల వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీ నుండి ఏడో తేదీ వరకు జరిగే తిరుపతమ్మ గోపయ్య స్వామి 14వ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 5న సుప్రభాత సేవ, ఆరవ తేదీన గణపతి పూజ గణపతి హోమం ఏడవ తేదీన బోనాలు కళ్యాణం నిర్వహించనున్న ట్లు తెలిపారు.

**జిల్లా స్థాయి కోలాట పోటీలు**

శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి జాతర సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా సాయి కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు. ఆసక్తి కలవారు 500 రూపాయల రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. కోలాట పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 25 వేల నూటపదహార్లు, రెండవ బహుమతిగా 20వేల 116 లు, మూడో బహుమతిగా 15వేల 116 ,నాలుగవ బహుమతిగా 10వేల 116, ఐదవ బహుమతిగ ఏడువేల నూట పదహారు, ఆరో బహుమతిగ ఐదు వేల నూట పద ఆరు రూపాయలు బహుమతిగా ఇవ్వనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సమాచారం కోసం ఈ క్రింది నెంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు. 7075884483 సంప్రదించగలరని కోరారు.

## మండలంలో రేషన్ డీలర్ల కొరత



**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో రేషన్ డీలర్ల కొరత ఉందని మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా రేషన్ షాపులు 34 ఉన్నాయని ఇందులో 29 మంది షాపులకు మాత్రమే డీలర్లు ఉన్నారని కొన్ని దుకాణాలలో ఒక్కో డీలర్లకు రెండు షాపులు కేటాయించడంతో పని భారం ఎక్కువై అధనంగా మరో వ్యక్తిని పెట్టుకొని పనిచేయించుకోవాల్సి వస్తుందని అన్నారు. రేషన్ డీలర్లకు నామమాత్రంగా జీతాలు ఉన్నాయని రేషన్ డీలర్లు గతంలో ఎన్నో ధర్నాలు నిర్వహించిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లపై ప్రత్యేక దృష్టి సారించి వారికి జీతాలు పెంచే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ డీలర్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో హామీలో భాగంగా డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామాలలో రేషన్ డీలర్ల కొరత లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డీలర్లు కోరుతున్నారు.

## జూన్ 2న రాష్ట్ర అవతరణ ఉత్సవాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలలో భాగంగా జూన్ 2 న ఉదయం 9 గంటలకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించబడనున్న ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించనున్నారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం జిల్లా కలెక్టర్ సందేశం ఉంటుంది.అంతకుముందు ఉదయం 8 గంటల 45 నిమిషాలకు జిల్లా కలెక్టర్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించనున్నారు.

## నిత్య అగ్నిహోత్రి ప్రారంభం



**ప్రజాపక్షం / మిర్యాలగూడ :** బోధిధర్మ ఆయుర్వేద వైద్యపీఠం వారి ఆధ్వర్యంలో మిర్యాలగూడ కార్యాలయంలో నిత్య అగ్నిహోత్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నిర్వాహకులు పండిట్ శ్రీనివాస్ గురూజీ మాట్లాడుతూ పూర్వకాలంలో గ్రామాలకు గ్రామాలు విషతుల్యాలతో నిండి గ్రామ ప్రజలందరు జబ్బుబారిన పడేవారని, అప్పట్లో వైద్యులు గ్రామం మధ్యలో అగ్ని హోత్ర హోమగుంగం నిర్మించి మూలికలు ఇచ్చి ఆ గ్రామాన్ని శుభ్రపరిచి ఆ గ్రామంలో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మిర్యాలగూడ పట్టణంలో అనేక యంత్రాలతో దుమ్ముధూలి వేడి చేసి ఇక్కడి ప్రజలు అనేక అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఈ తరుణంలో 108 ఆవు పిడకలతో ఒక కేజీ నెయ్యితో నిత్య అగ్నిహోత్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చేగొండి మురళియాదవ్, మాధవి, శ్రీజ, రాము, లింగా, విజయ్, మనోజ్, వాణి, రవి, జయ, కోటేశ్వరి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఎం.పి, పి.ఎం.పిలను ఇబ్బందులకు గురి చేయొద్దు



**ప్రజాపక్షం/చండూరు :** గ్రామీణ స్థాయిలో వైద్యం అందిస్తున్న ఆర్.ఎం.పి , పి.ఎం.పి లను ఇబ్బందులకు గురి చేయవద్దని ఏఐటియూసి జిల్లా మాజీ అధ్యక్షుడు, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ తెలంగాణ వైద్య మండలికి సూచించారు. శుక్రవారం ఆయన చండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం జిల్లా వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలలోని రోగులకు వైద్య సేవలందిస్తున్న ఆర్.ఎం.పి , పి.ఎం.పి లపై దాడులు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు అర్ధరాత్రి అనారోగ్యాలకు గురైనప్పుడు ఆర్ఎంపిలే వారికి ప్రదమ చికిత్సలను అందిస్తు వారి ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. ఎం ఎస్, ఎం డి , ఎం బి బి ఎస్ డాక్టర్లు పట్టణ ప్రాతాలకే పరిమితమైనప్పుడు గ్రామీణ స్థాయిలో పేదలకు వైద్యం ఏ విధంగా అందుతుందని ప్రశ్నించారు. ముఖ్యంగా ప్రభుత్వ డాక్టర్లు ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తూ గ్రామీణ ప్రాంతాలలోకి రాకుండా ఉండటంలో గ్రామీణ స్థాయిలో వైద్యం అందిస్తున్న ఆర్ఎంపి, పిఎంపి పై దాడులు ఆపాలని తెలంగాణ వైద్య మండలిని సతీష్ కుమార్ కోరారు.

## ఘనంగా మేడే ఉత్సవాలు




**ప్రజాపక్షం/ రామన్నపేట :** లారీ డ్రైవర్స్, క్లీనర్స్ ఆధ్వర్యంలో వేడే ఉత్సవాలను కొమ్మాయిగూడెంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల అద్యక్షుడు బత్తుల సత్యం, లారీ డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ అధ్యక్షుడు గోపగోని అశోక్‌గౌడ్‌లు మాట్లాడుతూ డ్రైవర్లకు జీవిత భరోసా కల్పించాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి హక్కులను సాదించుకోవాలన్నారు. యూనియన్ సభ్యుడు తండ సామ్మి భార్యతం అంజమ్మ ట్రాక్టర్ ప్రమాదంలో ఇటీవల మృతి చెందగ ఆమె కుటుంబానికి యూనియన్ సభ్యులు రూ.29,500ను అందించారు. కార్యక్రమంలో అశోక్‌గౌడ్, బెల్లి అంజయ్య, శ్రీశైలం, మల్లేశం, సహదేవ్, మల్లయ్య, మోహన్‌రెడ్డి, భిక్షం, కృష్ణ, సోమేష్, స్వామి, శ్రీను, నరేష్ తదితరులు ఉన్నారు.

# మారోజు వీరన్న స్ఫూర్తితో బహుజనరాజ్యం రావాలి

**ప్రజాపక్షం / సూర్యాపేట :** వర్గ,కుల నిర్మూలన జమిలి పోరాట సిద్ధాంత రూపకర్త అమరుడు మారోజు వీరన్న స్ఫూర్తితో తెలంగాణలో బహుజన రాజ్యం రావాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొపెసర్ ఆరుట్ల జానకిరాంరెడ్డి, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్యలు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ మారోజు వీరన్న 25వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999 మే 16న అప్పటి సీమాంధ్ర పాలకుల చేతిలో బూటకపు ఎన్‌కౌంటర్ గురైన మారోజు వీరన్న రూపొందించిన కులవర్గ పోరాట సిద్ధాంతం నేటికి ప్రకంపనాలు సృష్టిస్తుందన్నారు. ఆయన సిద్ధాంతాన్ని ఎత్తికోని ముందుకు తీసుకెళ్లే క్రమంలో బహుజన శ్రామిక రాజ్య స్థాపన లక్ష్యంగా రెవల్యూషన్ ఆఫ్ మారోజు పార్టీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తన మాట, ఆట, పాటలతో తెలంగాణ పల్లెలను రగిలించిన మారోజు రూపొందించిన సిద్ధాంతమే అగ్రకుల పాలకవర్గాలకు కంటగింపుగా మారిందన్నారు. మార్క్సిజం, అంబేద్కర్ ఇజం వెలుగులో నూతన సిద్ధాంతాన్ని రూపొందించిన దళిత బహుజనుల చేతికి వజ్రాయుధాన్ని అందించారని గుర్తు చేశారు. సిపియు ఎస్ఐ (ఆర్ఎం) పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చామకూరి నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐఎంఎల్ రామచంద్రన్ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్, జిల్లా కార్యదర్శి భాను ప్రసాద్, సియుసి రాష్ట్ర నాయకులు అబ్దుల్ కరీం, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు నల్లడ మాధవరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు దడిపల్లి వెంకట్, చెరుకుపల్లి లక్ష్మణ్, నవిల ఉపేందర్, నాగరాజు, గాలి వికాస్, పవన్, సామాజిక ఉద్యమకారులు, బహుజన నాయకులు, సామాజిక మహిళ సంఘం నాయకులు, నాగమణి, బేగం, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.




## పోలీస్ శాఖలో నాగేందర్ రావు సుదీర్ఘసేవలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పోలీస్ శాఖలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సీనియర్ అసిస్టెంట్‌గా నాగేందర్ రావు సుదీర్ఘసేవలు అందించారని జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిని నాగేందర్ రావు దంపతులను ఎస్‌పి, పోలీస్ అధికారులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ప్రజాసేవలో పాల్గొని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, ఎఓ మంజు భార్గవి, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, సభ్యులు అంజన్ రెడ్డి, వెంకయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీరారెడ్డి మృతి సిపిఎంకు తీరని లోటు



**ప్రజాపక్షం/ సూర్యాపేట రూరల్ :** సిపిఎం సీనియర్ నాయకులు గుర్రం వీరారెడ్డి పార్టీకి తీరని లోటని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డిలు అన్నారు. శుక్రవారం 11వ వార్డు రాయినిగూడెంలో వీరారెడ్డి మృతదేహానికి పూలమాలలు, ఎర్రజెండా కప్పి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తు చేశారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నాయకులు మేకనబోయిన శేఖర్, మందడి రాంరెడ్డి, నంద్యాల కేశవ రెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, నాగార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

## కళాశాలకు పేరుప్రఖ్యాతలు తేవాలి



**ప్రజాపక్షం/కోదాడ :** బిటెక్ పూర్తిచేసిన విద్యార్థినులు ఉన్నత ఉద్యోగాలు పొంది కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల అకడమిక్ అడ్వైజర్ పోతుగంటి నాగేశ్వరరావు, డైరక్టర్ సిహెచ్ నాగార్జునరావులు అన్నారు.శుక్రవారం స్థానిక కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ఫైనలియర్ పూర్తి చేసిన విద్యార్థినులకు తృతీయ సంవత్సరం విద్యార్థినులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వారు మాట్లాడారు. ఉన్నత ఉద్యోగాలు, విద్యలు అభ్యసించి జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థినులు ఆదర్శంగా నిలవాలన్నారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గాంధీ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థినులు ఎక్కడ ఉన్న జూనియర్ విద్యార్థినులకు మార్గదర్శకంగా ఉంటూ సహకారాలు అందించాలన్నారు.ఏస్థాయిలో ఉన్న కళాశాల అధ్యాపకులను మరచిపోవద్ద న్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌వోడీలు జనార్ధన్,లక్ష్మణ్, సైదిరెడ్డి, నవీన్, జ్యోతి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**ప్రజాపక్షం/కోదాడ :** 20242025 విద్యా సంవత్సరం జూన్ 12 నుండి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆర్డీవో సిహెచ్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నిర్వహణ, బడిబాటపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూన్ 7 వరకు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 3 నుండి 19 వరకు జరిగే బడిబాటలో రెవిన్యూ, పంచాయతీరాజ్,శిశు సంక్షేమ,అంగన్‌వాడిశాఖలు విద్యాశాఖతో సమన్వయమై భాగస్వాములు కావాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. బడి అందరి బాధ్యత అని అమ్మ ఆదర్శ కమిటీలు పాఠశాలల బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. మండల విద్యాధికారి సలీం షరీఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణ సిఐ రాము, మెప్మా పిడి, ఏపిఎంలు,ఎంపిఈవోలు,అంగన్‌వాడి సూపర్‌వైజర్స్, హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి లక్ష మల్లెల పుష్పార్చన



**ప్రజాపక్షం/ సూర్యాపేట రూరల్ :** సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని పిల్లలమర్రి శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హనుమాన్ జయంతి త్రయానికి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి లక్షమల్లెల పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దరూరి వెంకటరాఘవా చార్యులు ఆంజనేయ స్వామికి లక్ష మల్లెల పుష్పార్చనతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ధర్మకర్త గవ్వ కృష్ణారెడ్డి మాట్లాడుతూ చారిత్రాత్మక దేవాలయాలు మన పిల్లలమర్రిలో ఉండటం మన గ్రామానికి ఎంతో విశేషమని, అతి పురాతన శ్రీ అభయాంజనేయ ఆలయంలో లక్షపుష్పార్చన నిర్వహించడం ఎంతో పుణ్యమన్నారు. లక్ష మల్లేల పుష్పార్చన కార్యక్రమానికి దాతలు బ్రహ్మదేవర సీతయ్య కళావతి దంపతులు సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దరూరి సింగారా చార్యులు, చింతాడ రామానుజ చార్యులు, ముడుంబై రఘువరన్ ఆచార్యులు, అబ్బూరి వినోద్ శ్యామల, షెక్ జానిమీయా, సికిర వీరేశం సరస్వతి, దేవరశెట్టి ముకుందం, మనసాని నాగేశ్వర్ రావు, మహిళ భక్తులు సారిక, గవ్వ పద్మ, మెరెడ్డి సువర్ణ, అనసూర్య, సునంద, మల్లీశ్వరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ పోగాకు దినోత్సవం




**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** లయన్స్‌క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల వారి ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రపంచ పోగాకు వ్యతిరేక దినోత్సవం అవగాహన కార్యక్రమం క్లబ్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్‌పర్సన్ బట్టు మధు అధ్యక్షతన శుక్రవారం జరిగింది.ఈ సందర్భంగా వారు ధూమపానం నిరోధానికి సంబంధించిన నియమాలపై ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో చాలా మంది ధూమపానంకు బానిసై ఊపిరితిత్తులు,క్యాన్సర్ వంటి వ్యాధులతో ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందన్నారు.ఆరోగ్యం పట్ల జాగ్రత్త పాటిస్తూ ధూమపానానికి దూరంగా ఉండాలని, యువత మేల్కోని ఇటువంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు.కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి,ఉపాధ్యక్షుడు కర్రి సూర్యనారాయణరెడ్డి, క్లబ్ సభ్యులు యూసుఫ్, చిత్రం విశ్వనాథ్, వీరారెడ్డి,యేసు,యువకులు పాల్గొన్నారు.

## సైన్స్ ఉపాధ్యాయులతో సైన్స్ మాత్రమే చెప్పించాలి

**ప్రజాపక్షం/ సూర్యాపేట రూరల్ :** ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న సైన్స్ ఉపాధ్యాయులతో సైన్స్ బోధనకే పరిమితం చేయాలని ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ సూర్యాపేట శాఖ అధ్యక్షులు చింతరెడ్డి రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమవుతునందున 6,7 తరగతులకు సంబంధించి గణితము, భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు బోధించాలని విద్యాశాఖ కార్యదర్శి మెమో ద్వారా ఉత్తర్వులు జారీ చేయడం సరైంది కాదన్నారు. వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు కె గురుమూర్తి, చందా శ్రీను, జ్యోతుల చంద్రశేఖర్, యామా రమేష్, కందుకూరి సోమశేఖర్, రావిరాల చంద్రశేఖర్, పిన్ని మధు, బింగి లక్ష్మయ్య, డి ఎల్లయ్య, గోపయ్య, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేసిన ఆర్‌డిఓ



**ప్రజాపక్షం/కోదాడ :** పట్టణంలోని ఎరువుల, పురుగుమందుల దుకాణాలను ఆర్డీవో సూర్యనారాయణ శుక్రవారం ఆకస్మీకంగా తనిఖీ చేసి దుకాణాలలో స్టార్ రిజిస్ట్రర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రోజువారీగా ఎరువుల, విత్తనాల ధరలను, స్టాక్ వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సాయిగౌడ, పట్టణ సిఐ రాము, ఏవో రజిని పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను అందించాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని మండల వ్యవసాయాధికారి ఆర్.స్వర్ణ విత్తన డీలర్లను కోరారు.శుక్రవారం పట్టణంలోని విత్తన విక్రయ కేంద్రాలను ఆమె మండల తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎస్ఐ జి. ముత్తయ్యతో కలసి విత్తన విక్రయ కేంద్రాలను పరిశీలించారు.ఈసందర్భంగా ఏవో స్వర్ణ మాట్లాడుతూ విత్తన డీలర్స్ విత్తనాలకు సంబంధించిన రికార్డులను సరియైన పద్దతిలో నిర్వహించాలన్నారు. విత్తన నిల్వలకు సంబంధించిన స్టాక్ బోర్డ్స్ మెయింటెన్ చేయాలని సూచించారు. రెవిన్యూ, వ్యవసాయ,పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ టీఎంలు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతిరోజు ఈ టీమ్‌లన్ని రిటైల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విత్తన డీలర్లు ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏవో తెలియజేశారు.

## బడిబాట అమలుపై సమావేశం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** 20242025 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అనుసరించాల్సిన రోజువారి కార్యక్రమాలు, జూన్ 3 నుండి 19 వరకు చేపట్టనున్న బడిబాట కార్యక్రమం విధివిధానాలపై ఎంఈవో సైదానాయక్ శుక్రవారం రైతువేదిక నందు ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, పంచాయతీకార్యదర్శులు, వివోలచే సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపిడివో ఎంపిడివో పవన్‌కుమార్, తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండల పరిధిలోని భీమనపల్లి గ్రామంలో మురికి నీరు రోడ్డు మీదికి రావడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని డ్రైనేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల పార్టీ డిమాండ్ చేసింది. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో భీమనపల్లి నుండి కనుముకుల గ్రామానికి వెళ్లే దారిలో పార్టీ నాయకులు సందర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు నీరు రోడ్డుమీదకు చేరడంతో దుర్వాసన వస్తుందని అన్నారు. డ్రైనేజీ నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని అన్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు కోట రామచంద్రారెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాదం విష్ణు, మంచాల మధు, మండల కమిటీ సభ్యులు కలుకూరి బిక్షప,తి నెలకంటి జంగయ్య, నాయకులు బూరుగు బిక్షపతి, పురుషోత్తం రెడ్డి, జంగారెడ్డి, మల్లేష్ ,పాండురంగారెడ్డి, బిక్షపతి, జనార్దన్ రెడ్డి,జంగారెడ్డి,నరసింహ, కుంభం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ధూమపాన నిషేధంపై అవగాహన




**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణ కేంద్రంలో డాక్టర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ధూమపాన నిషేధ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎంహెచ్ఓ పాపారావు, డిఎం యశోద హాజరై మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు పాటుపడుద్దని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, సుమన్, వంశీకృష్ణ, పిహెచ్‌సిఓ పెద్ద లక్ష్మి, ఏఎన్ఎంలు కవిత, సునీత, జయమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళాశక్తి కుట్టు కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని మహిళా శక్తి కుట్టు కేంద్రాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలకు సలహాలు సూచనలు ఇచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు భాగంగా పాఠశాలలో జరిగినటువంటి రిపేరు పనులను కూడా పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మీనా, పిఎం శ్రీనివాస్, సిసి సరస్వతి, మహిళలు పావని, రమా, సంతోష, విజయ, వేదిక తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలు,పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ సూర్యాపేట జిల్లా కీర్తి శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు పాఠ్య పుస్తకాలను అమ్ముతూ, విద్యార్థుల తల్లిదండ్రులను వివిధ రకాల ఫీజులను వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. 2009 సంవత్సరంలో జీవోనెంబర్ 91 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో టెక్నో,ఈ టెక్నో, డీజీ టాలెంటెడ్ అనే బ్రాండ్ల పేర్లతో పాఠశాలలు నడపవద్దని, పాఠ్యపుస్తకాలు అమ్మవద్దని నిబంధన ఉన్నప్పటికి వాటిని పట్టించుకోవడ లేదన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు మేల్కొని అధిక ఫీజులు వసూలు చేస్తున్న,పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును రద్దుచేసి వాటిపైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రెవెన్యూ ఆఫీస్ ఎదుట నిరసన



**ప్రజాపక్షం/ఆలేరు :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల పరిధిలోని శారాజీపేట గ్రామానికి చెందిన జేరిపోతుల చంద్రయ్య శుక్రవారం ఎంఆర్ఓ ఆఫీస్ ఎదుట తమకు న్యాయం చేయాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్బంగా జేరిపోతుల చంద్రయ్య మాట్లాడుతూ కమ్మరి లక్ష్మమ్మ పేరున సర్వేనెంబర్ 230లో ఎె 200లు గల వ్యవసాయ భూమిని డాక్యుమెంటు నెం.485/1986 ద్వారా దివి. 31031986 రోజున కొనుగోలు చేసుకున్నానని, అప్పటి నుండి తాను కబ్జాలో ఉంటూ కాస్తు చేసుకుంటున్నానని, తమది ఉమ్మడి కుటుంబం కావడంతో మా అన్న తమకు తెలియకుండా నా పేరున గల డాక్యుమెంటు దొంగిలించి, 200లు పట్టా చేయించుకున్నాడనీ. అతని వద్ద కొనుగోలు చేసుకొన్నట్లు ఎలాంటి ఆధారాలు ఏమి లేవు. ఇట్టి విషయము తెలిసిన నేను మీ సేవా ద్వారా పాసుబుక్కు డాటా కరెక్షన్ దరఖాస్తు చేసుకున్నానని. ఇట్టి భూమిపై ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు ఉన్నపటికీ మా అన్న ఇట్టి భూమిని ఇతరులకు విక్రయించడానికి ప్రయత్నించుచున్నాడనీ ఇట్టి అక్రమ పట్టాను రద్దు చేయాలని ఎంఆర్ఓకి అప్లికేషన్ ఇచ్చి తమకు న్యాయం చేయాలని ఆఫీస్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

# ముగింపు వేడుకలు విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/దేవరకొండ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు విజయవంతం చేయాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్1 , జూన్ 2, జూన్ 3 తేదిలలో మూడు రోజుల పాటు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించడం జరుగుతుందని జూన్ ఒకటవ తేదిన గన్ పార్క్ అమరవీరుల స్థూపం నుండి ట్యాంక్ బండ్ వరకు కొవ్వోత్తుల ర్యాలీ, అనంతరం అమరల వీరుల స్థూపానికి నివాళి, మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ అర్పించనున్నారని తెలిపారు. జూన్ రెండున రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది కాలం గడుస్తున్న నేపథ్యంలో దశాబ్ది ముగింపు వేడుకల సభను హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కేసీఆర్ అధ్యక్షతన సమావేశం, శరణార్దులకు పండ్ల పంపిణి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో పలు దవాఖానాలలో, అనాధ ఆశ్రమాలలో పండ్ల పంపిణి కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయుకులు ఆంజనేయులు, రవికుమార్, రాజేష్, శ్రీనివాస్, రాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపిపి గూడెపు శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన చివరి మండల సర్వసభ్య సమావేశం ప్రశాంత వాతావరణంలో సాదాసీగాదా సాగింది.సర్వసభ్య సమావేశంలో మిషన్‌భగీరథ ద్వారా తాగు నీరు,విద్యుత్ సమస్యలు,చెరువుల ఆక్రమణ,ఉపాధిహామీ పథకం అమలు,ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడి నియంత్రణ, వైద్యశాఖ పనితీరు, వ్యవసాయశాఖ ద్వారా రైతులకు సబ్సీడిపై జిలుగు విత్తనాలు,ఎరువులు సరఫరా వంటి అంశాలపై సమావేశంలో చర్చించడం జరిగింధి.ఈ సందర్భంగా ఎంపిపి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వేసవికాలంలో మండలంలో మంచినీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేసిన సంబంధిత శాఖ అధికారులు ఖర్చుచేయక పోవడం పట్ల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.జడ్‌పిటిసి కొప్పుల సైదిరెడ్డి మండలలోని వివిధ గ్రామాల్లో చెరువుల్లో అక్రమంగా మట్టి తరలింపుపై,చెరువుల భూముల ఆక్రమణపై నీటిపారుదలశాఖ అధికారులు దృష్టి సారించడంతో పాటు అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ విషయంపై నీటిపారుదలశాఖ ఏఈ తుమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ చెరువుల ఆక్రమణపై పలు కేసులు పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీస్‌శాఖ వారు పట్టించుకోవడంలేదని తెలిపారు. సమావేశంలో ఎంపిటిసిలు సింగతల సైదమ్మ,ముడెం గోపిరెడ్డి, మచ్చ వెంకటేశ్వర్లు, కాశమ్మ,వల్లభనేని విజయలక్ష్మి ,పిఏసిఎస్ చైర్మన్లు దొంగరి వెంకటేశ్వర్లు, అన్నెం శౌరెడ్డి,కట్టా గోపాలరావు,కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అబీద్‌బాబా,ఎంపిడివో లావణ్య,మండల వైద్యాధికారి పుష్ప, ఎంఈవో సైదానాయక్,పశు వైద్యా ధికారిశ్రీనివాసరెడ్డి,ఏవో స్వర్ణ,ఏపివో శైలజ,ఏపిఎం స్వరూప, సూపరిండెంట్ నర్సిరెడ్డి, పిఆర్ ఏఈ సాయిరాం,పంచాయతీ కార్యదర్శులు,ఎంపిడివో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ముందస్తు వ్యవసాయ ప్రణాళికపై అవగాహన



**ప్రజాపక్షం/ రామన్నపేట :** మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో క్లస్టర్ రైతు వేదికలో ఏరువాక కేంద్రం యాదాద్రి భువనగిరి శాస్త్రవేత్తలు రామన్నపేట వ్యవసాయాధికారులు రైతులకు ముందస్తు వ్యవసాయ ప్రణాళికపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ వేసవిలో దుక్కులు దున్నుకోవడం వల్ల జరిగే ఉపయోగాలు, సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల కలిగే లాభాలు, విత్తనాల ఎంపికలో తీసుకోనే జాగ్రత్త, నకిలి విత్తనాల వల్ల జరిగే నష్టాలు గురించి రైతులకు వివరించారు. వానాకాలంలో వరి, పత్తిలో వచ్చే తెగుళ్లు, చీడపీడల గురించి వాటి యాజమాన్య పద్ధతుల గురించి, వరిలో నేరుగా విత్తు పద్ధతి, డ్రం సీడర్‌తో వరి సాగు విధానం తదితర విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్, శాస్త్రవేత్త మమత, ఏవో పద్మ, ఏఈవోలు వెంకన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్‌షాక్‌తో ఆవు మృతి



**ప్రజాపక్షం/మోటకొండూరు :** మోటకొండూరు మండలంలోని మాటూర్ శాఖంపల్లిలో సాపిడి ఉపేందర్‌కు సంబంధించిన ఆవు వ్యవసాయ పొలంలో మేత మేస్తూ ప్రక్కన ఉన్న ట్రాన్స్ ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందినది. సుమారు ఆవు విలువ 50 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని ఉపేందర్ అధికారులను కోరారు.

## ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిజిపికి ఫిర్యాదు

**ప్రజాపక్షం/ శాలిగౌరారం :** తనపై దాడి చేసిన వ్యక్తులపై నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదుకు రసీదు ఇవ్వకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయని స్థానిక ఎస్ఐపై చర్య తీసుకుని తనకు న్యాయం చేయాలని రాష్ట్ర డిజిపికి ఆమ్ ఆద్మీ పార్టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తం రెడ్డి ఫిర్యాదు చేశారు. నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని ఊట్కూరు గ్రామానికి చెందిన యంపల్ల పురుషోత్తం రెడ్డిపై ఈ నెల 23 న జరిగిన దాడిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుకు సంబంధించిన రసీదును ఇవ్వమని అడిగాడు. ఎస్ఐ రసీదు ఇవ్వకపోవడంపై డిజిపికి ఫిర్యాదు చేశానని పురుషోత్తం రెడ్డి తెలిపారు.

## నకిలీ విత్తనాల అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం




**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలో నకిలీ విత్తనాల అమ్మకాలు జరిపితే సంబంధిత విత్తన డీలర్లపై,ఫర్టిలైజర్ షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని చింతలపాలెం,మేళ్లచెర్వులు ఎస్ఐలు సైదిరెడ్డి, పరమేష్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నకిలీ విత్తనాలపై విత్తన డీలర్లతో, ఫర్టిలైజర్ షాపు యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా స్టాక్ రిజిస్ట్రర్‌ను మెయింటెన్ చేయాలని జిల్లా ఉద్యావనశాఖ అధికారి నాగయ్య తెలియజేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సంధ్యారాణి మాట్లాడుతూ డీలర్లు రైతులకు బిల్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ఎస్ఐ,ఏవో,ఏడీఏలు విత్తన దుకాణాలను తనిఖీ తగు సూచనలు తెలియజేశారు. సమీక్షా సమావేశం కార్యక్రమంలో ఏఈవోలు సంధ్య,రియాజ్,మిర్చి,విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.